రక్తదానం మరొకరికి ప్రాణదానం : డిఎస్‌పి

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిఎస్‌పి చైతన్య

రాజంపేట అర్బన్: రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణానికి మనం ఆధారంగా నిలబడ గలుగుతామని డిఎస్‌పి వి.ఎన్.కె.చైతన్య అన్నారు. మంగళవారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ శిబిరంలో కడప, రాజంపేట నుంచి పెద్ద ఎత్తున యువత పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు మానవతా సంస్థ అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు పివిఎస్ రాజు, సూపరింటెండెంట్ ఆర్‌ఎంబిఆర్‌సి మోహన్‌రెడ్డి, వైద్యులు చంద్రకళ, సిబ్బంది సత్యసాయి లీలమ్మ, నాగరాజు, చంద్రబాబు, మధుబాబు, మానవత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రాముడు, శ్రీనివాసులు నాయుడు, లయన్ అబ్దుల్లా, రామచంద్ర నాయుడు చెంగయ్య పాల్గొన్నారు.

జడ్‌పిలో అవినీతి లొల్లి

జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ పనితీరు అధ్వానంగా ఉందని, సంస్కరించని పక్షంలో వాకౌట్ చేసి వెళ్లిపోతామని హెచ్చరికల మధ్య జిల్లా పరిషత్ సమావేశం నడిచింది. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. భూములను ఆన్‌లైన్ చేయడం, సాధారణ భూములను వివాదాస్పదంగా మార్చడం, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సస్పెన్షన్లకు గురికావడం వంటి పనితీరుతో పరాకాష్ఠకు చేరుకుందని చెప్పవచ్చు. రెవెన్యూ అధికారుల పనితీరు ఇలా ఉండగా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పనితీరు సైతం పోటీ పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి బద్వేల్ ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ పిఆర్ మినహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. వేంపల్లి మండలంలో టెలికాం డిపార్టుమెంట్‌కు ఇచ్చిన 50 సెంట్ల స్థలంలో 20 సెంట్లు ఖాళీగా ఉన్న నేపథ్యంలో వెనక్కు తీసుకుని ఆర్టీసీ బస్టాండుకు, జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో డిసిఇబి హాలుకు 10 సెంట్లు ఇస్తున్న తీర్మానాలను ఆమోదించడం గమనార్హం.

హాజరైన ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

- తహశీల్దార్ల అవినీతిపై ఆగ్రహం
- భూముల ఆన్‌లైన్‌లో గోల్‌మాల్
- గండికొవ్వూరు క్వారీ రద్దుకు డిమాండ్
- స్పందన లేని సమావేశాలపై సభ్యుల మండిపాటు
- బద్వేల్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పిఆర్ మినహా ప్రజాప్రతినిధులు డుమ్మా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వసభ్య సమావేశం నిట్టూర్పుల, నిరసనలు, ఆగ్రహాల మధ్య సాగిపోయింది. ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ సభ్యుల్లో నైరాశ్యం నెలకొంది. రెవెన్యూ మొదలుకుని విద్య, వైద్యం, మైనింగ్, ఆర్అండ్‌బి, హౌసింగ్ డిపార్టుమెంట్ల చుట్టూ కేంద్రీకృతమైంది. బి.మఠం ఎంపిపి వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌లుగా మారిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల అవినీతిని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని, మీరు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.. సామాన్య భూములను వివాదాస్పదంగా మార్చి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మల్లేపల్లి రేషన్ డీలర్ 40 బస్తాల బియ్యం సహా దొరికిపోయి తొలగింపునకు గురయ్యారని, అటువంటి వ్యక్తిని మళ్లీ కొనసాగిండమేమిటని ప్రశ్నించారు. ఇటువంటి వివాదాస్పద తహశీల్దార్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సభ నుంచి వాకౌట్ చేస్తామని తీవ్రస్వరంతో హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకుని గత తహశీల్దార్‌ను బదిలీ చేశామని పేర్కొనగా వెండిపల్లెం నుంచి బంగారుపల్లెనికి బదిలీ చేశారని, ఏమి లాభమని నిట్టూర్పులిచ్చారు. వీరపునాయునిపల్లి, కాశినాయన జడ్‌పిటిసిలు స్పందించి తహశీల్దార్ల ఇష్టారాజ్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, తమ తహశీల్దార్లు కూడా భూముల కేటాయింపులు, ఆన్‌లైన్ ఎక్కించడంలో అవినీతికి పాల్పడడంతో వ్యవస్థ దారుణంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. చక్రాయపేట మండల పరిధిలోని అద్దాలమర్రి, మాల్లెలమడక, గండికొవ్వూరు ప్రాంతాల్లో ఫిల్టర్ల ఆధారంగా వరి పంటను సాగు చేశారని, గండికొవ్వూరు సమీపంలోని ఇసుక క్వారీలో నిబంధనల్ని ఉల్లఘించి 10 మీటర్లకుపైగా ఇసుకను తోడేయడంతో ఫిల్టర్లు ఎండిపోతున్నాయని, క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వెలిగల్లు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వీరపునాయునిపల్లి సమీపంలోని జగనన్న లేఅవుట్‌కు ఇసుక కొరత ఏర్పడిందని, అతి సమీపంలోని ఇసుకను విస్మరించి, పులివెందుల ప్రాంతం నుంచి ఇసుకను రవాణా ఛార్జీలను భరించి తెచ్చుకోవాల్సి రావడంతో హౌసింగ్ పనులు భారంగా మారాయనే ఆందోళన వ్యక్తమైంది. పోరుమామిళ్ల జగనన్న కాలనీకి మట్టి, ఇసుక, రాయి కొరత ఏర్పడితుందని జడ్‌పిటిసి వాపోయారు. బి.మఠం మండలం సోమిరెడ్డిపల్లి, పలుగురాళ్లపల్లి పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న పిల్లల పేర్లను నమోదు చేసి విద్యాభ్యాసం సాగిస్తున్నట్లు చూపుతుండడంపై ఆక్షేపించారు. డిఇఒ స్పందించి డిప్యూటీ డిఇఒతో కమిటీ వేశామని, నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బి.మఠం మండలంలోని ఉపాధ్యాయులు లెక్కచేయని ఎంఇఒను కలసపాడు మండలానికి డిప్యూటేషన్ వేయడమేమిటని ప్రశ్నించారు. కాశినాయన, బి.కోడూరు కెజిబివిలకు రక్షణ గోడలను ఏర్పాటు చేయడంలోని అధికారుల వైఫల్యాన్ని నిలదీశారు. వేంపల్లి హైస్కూల్ ప్రహరీ కూల్చి వేత, పెనగలూరు మండలంలోని ఎంఆర్‌పురం స్కూల్ ప్రహరీ ఏర్పాటు చేయకపోవడంతో దుర్భరంగా మారిందని సభ్యులు ఎత్తిచూపారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో అధికారుల దృష్టికి తీసుకెళ్దామనుకుని ఫోన్‌లు చేస్తే తహశీల్దార్లు మొదలు ఆర్‌డిఒ, హౌసింగ్ పీడీ స్థాయి అధికారులు కాల్స్ తీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గత సమావేశం నుంచి ఆర్అండ్‌బి ఎస్ఇ దృష్టికి రహదారుల మరమ్మతుల అంశం తీసుకొస్తున్నప్పటికీ స్పందన లేదన్నారు. కాశినాయన మండలం నరసాపురం నుంచి ఉప్పలూరు రహదారి, 13 కి.మీ పొడవు కలిగిన బద్వేల్ నుంచి బిమఠం రహదారి అధ్వాన్నంగా ఉన్నాయని, మనుషులు మొదలుకుని వాహనాలు వెళ్లడానికి తీవ్రఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. ఆర్‌టిపిపి గొట్టాల నుంచి పొగల స్థానంలో బూడిద వస్తోందని, ఫలితంగా గ్రామాల్లో దుర్భర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధులు జిల్లా, మండల పరిషత్, జిల్లా రివ్యూ కమిటీ సమావేశాలకు గైర్హాజరు కావడం ప్రజల అభీష్టాన్ని నిర్లక్ష్యం చేయడమేననడంలో సందేహం లేదు.

ఎస్‌పిలు బదిలీ



కడపకు సిద్ధార్థ కౌశల్, అన్నమయ్యకు కృష్ణారావు నియామకం

అన్నమయ్య జిల్లా నూతన ఎస్‌పి కృష్ణారావు

కడప జిల్లా నూతన ఎస్‌పి సిద్ధార్థ కౌశల్

ఎస్‌పి గాంగాధర్‌రావు

ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం రాష్ట్రంలోని పలువురు ఐపిఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కడప జిల్లా ఎస్‌పి కెకెఎన్.అన్బురాజన్ 2019 అక్టోబర్ 11 నుంచి సుమారు నాలుగేళ్లుగా పోలీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. పోలీసు విధులకు సవాల్‌గా మారిన పంచాయతీ ఎన్నికల దగ్గర నుంచి ఎంపిటిసి, జడ్‌పిటిసి, ఎమ్మెల్సీ వంటి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దగ్గర నుంచి నేటి వరకు ముఖ్యమంత్రి జిల్లాలో బాధ్యతలు నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీ పిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఐపిఎస్‌ల బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. అన్బురాజన్ అనంతపురం జిల్లా ఎస్‌పిగా బదిలీ అయ్యారు. కడప జిల్లా నూతన ఎస్‌పిగా ఆక్టోపస్‌లో పనిచేస్తున్న సిద్ధార్థ కౌశల్‌ను నియమించింది. అన్నమయ్య జిల్లా ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు ఆర్నెళ్ల కిందటే బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆయనను అతి తక్కువ కాలంలోనే అనంతపురం జిల్లా 14వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఎసిబి ఎస్‌పిగా పనిచేస్తున్న బొడ్డేపల్లి కృష్ణారావ్‌ను నియమించింది. వీరందరూ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విఒఎలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వం యానిమేటర్లకు మూడేళ్ల వరకే ఉద్యోగం ఉండేలా విడుదల చేసిన కాలపరిమితి సర్క్యులర్ 64ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి.రెడ్డెప్ప అన్నారు. యానిమేటర్ల రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన యానిమేటర్ల నిరసనలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతికి తోడ్పడే 28 వేల మంది యానిమేటర్ల కుటుంబాలు ప్రభుత్వ అనాలోచనతో విడుదల చేసిన 64వ సర్క్యులర్‌తో రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించుకొని మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.8 వేల జీతంలో ప్రభుత్వ యాప్‌లకు, రవాణా ఖర్చులకు 3వేలు ఖర్చు పోగా, కేవలం రూ.5 వేలతో కుటుంబాలు నెగ్గుకు రావాలంటే చాలా ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. జీతాలు రాక, చేసిన అప్పులతో వ్యథకు గురై పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, పెరిగిన ధరలతో తీవ్ర ఇక్కట్లతో మానసిక ఆందోళనల నుండి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.ఏప్రిల్ నుండి పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యానిమేటర్ల సంఘం జిల్లా నాయకులు రాణి మాట్లాడుతూ ధరలకనుగుణంగా కనీసవేతనం రూ.21 వేలు ఇవ్వాలని, సిబిఒహెచ్ఆర్ అమలు చేసి, సంఘాల మార్జించు ఆపాలని, రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని లేనియడల రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకైనా వెనుకాడబోమని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ గిరీష అందజేశారు. కార్యక్రమంలో యానిమేటర్ల సంఘం జిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు పరంజ్యోతి, కృష్ణమ్మ, పవన్, కరీముల్లా, కన్యాకుమారి, చెన్నమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

గురువులు సమాజ నిర్మాతలు : కలెక్టర్

మంత్రి నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ఓబుల్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి

విజ్ఞానాభివృద్ధికి గురువు పునాదిలాంటివారని తన ఉన్నతకి దోహద పడింది గురువులే అని కలెక్టర్ గిరీషా పిఎస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని లయగార్డెన్స్ హాలులో విద్యా శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తర్వాత రెండవసారి ఇంత పెద్ద ఎత్తున గురుపూజోత్సవం వేడుకలు నిర్వహించిన విద్యాశాఖకు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రుల తర్వాత ఆస్థానం గురువుదేనన్నారు. గురువు ఒక మార్గదర్శనం వారు లేకుండా ఎవరూ లక్ష్యాన్ని సాధించలేరని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది దేశం గర్వపడేలా చేస్తోంది గురువులే అన్నారు. మిగతా దేశాలతో పోటీ పడాలంటే పిల్లలను ఒక మంచి సిటిజన్‌గా తయారు చేయాలన్నారు. తల్లిదండ్రులతో పాటు సమాజం చుట్టుపక్కల వారిని గుర్తించేలా పిల్లలను తీర్చిదిద్దాలని చెప్పారు. పిల్లల మనసు ఇతర మార్గాల వైపు వెళ్లకుండా మంచి భవిష్యత్తు తీర్చిదిద్దుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. నేడు ప్రపంచం మొత్తం మన దేశం వైపు చూస్తోందని, ఎక్కడికి వెళ్ళినా మన దేశ పిల్లలు ఉన్నారని చెప్పారు. యుఎస్, యూరోపియన్ కంట్రీలలో మన ఇండియన్స్‌కు ఒక మంచి గుర్తింపు ఉంది అన్నారు. ఇందుకు కారణం ఉపాధ్యాయులని తాను నమ్ముతాను పేర్కొన్నారు. విద్యార్థులను బాగా తీర్చిదిద్దుతారని విద్యాభివృద్ధిలో జిల్లాను రాష్ట్రం దేశంలో ఒక ప్రత్యేక స్థానం పొందేలా కృషి చేయాలని ఆశిస్తున్నానన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులందరికీ కలెక్టరు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నడక, నడత, నేర్పించి భవిష్యత్తులో ఎలా ఉండాలని తీర్చిదిద్దే వ్యక్తులు మన గురువులన్నారు. నేడు మన దేశం ఇంత పురోగతి సాధించడానికి, ఇంత వేగంగా అభివృద్ధి చెందడానికి గురువులు మూలకారకులని పేర్కొన్నారు. భవిష్యత్తులో గురువులకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. డిఇఒ మాట్లాడుతూ గురువులు సమాజ నిర్మాతలని, నిత్యం తనను తాను మలుచుకుంటూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం గురువుల బాధ్యత గురువుల గురుతల బాధ్యతలను గుర్తుంచుకోవాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం : జిల్లా వ్యాప్తంగా 93 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను కలెక్టర్, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, జ్ఞాపిక ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, డిప్యూటీ డిఇఒలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఓబుల్‌రెడ్డి : విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ కట్టమంచి రామలింగారెడ్డి కాన్వకేషన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా మార్ల ఓబుల్‌రెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈయన సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 26 ఏళ్లుగా విద్యాశాఖకు అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డుతో ఓబుల్‌రెడ్డిని ప్రభుత్వం గౌరవించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రభుత్వం గుర్తించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ లోకవర్ధన్

క్షేత్ర స్థాయిలో ఆశాల సేవలు కీలకం

- డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్

ప్రజాశక్తి-పీలేరు

క్షేత్ర స్థాయిలో ఆశాల సేవలు కీలకమని అన్నమయ్య జిల్లా డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. ఆశ దినోత్సవంలో భాగంగా మంగళవారం కెవి పల్లి మండలంలోని గ్యారంపల్లి పిహెచ్‌సిలో డాక్టర్ లోకవర్ధన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో చేసిన పనిని అంచనా వేసుకుని, రాబోయే నెలలో ఏ కార్యక్రమంలో విధులు నిర్వహించి లక్ష్యం సాధించాలి అనే దానిపై సమీక్షించుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 11 నుండి 16వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంలో లబ్ధిదారులను గుర్తించిన వారికి టీకాలు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి పిహెచ్‌సిలో కాన్పులు జరిగేలా ఆశ కార్యకర్తలు వారి పరిధిలోని గర్భిణులను ప్రోత్సాహించి కాన్పులు జరిగేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పిహెచ్ఎన్ రెడ్డెమ్మ, పర్యవేక్షకులు శ్యామల, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్ర ఈ నెల ఏడవ తేదీకి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రాయచోటిలో చేపడుతున్న సంఘీభావ పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ రాజంపేట పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల కన్వీనర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు, మండలాధ్యక్షులు, యువ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులతో పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయాచోటి పట్టణంలోని శివాలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు పాదయాత్ర చేస్తామనా2నరు. కార్యక్రమంలో శెట్టిపల్లి సన్నీ పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని 14వ వార్డులో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజలతో మమేకమవుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించారు వార్డు కౌన్సిలర్ షేక్ షబానా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా. మంగళవారం వార్డు వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులతో కలసి నేరుగా ప్రజలను కలుసు కొంటూ వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు అర్హులందరికీ అందుతున్నదీ లేనిది ఆరా తీశారు. వార్డులో పారిశుధ్యంపైన ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. మౌలిక సదుపాయాలు కల్పనలోను ప్రజల అభిప్రాయాలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ వార్డు ప్రజల ఆకాంక్షల మేరకు తాము సేవలు అందిస్తామన్నారు. వర్షాకాలం కావడంతో వర్షాలు పడుతున్నందువలన వాటిలో పారిశుధ్యంపైన ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు మురుగు కాలువలు శుభ్రం చేయటం, దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వార్డులో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పడానికి అన్నివిధాలుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నది లేనిది ప్రజాభిప్రాయాన్ని సేకరించామన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే వారిని పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం అడ్మిన్ హరి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముల్బాగల్‌లో మదనపల్లి వ్యక్తి లాకప్‌డెత్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా ముల్బాగల్‌లో లాకప్‌డెత్ తీవ్ర కలకలం రేపుతోంది. పట్టణానికి చెందిన ముగ్గురిని ఓ కేసులో ముల్బాగల్ పోలీసులు తీసుకెళ్లి విచారించారు. పోలీసుల అదుపులో ఉన్న ఆ వ్యక్తి అర్ధరాత్రి సమయంలో కస్టడీలోనే అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుని కుమారుడిని కూడా పోలీసులు తీసుకెళ్లడంతో ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. లాకప్ డెత్ అయిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేగవంతంగా అభివృద్ధి పనులు : గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష అన్ని శాఖల హెచ్‌ఒడిలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల హెచ్‌ఒడిలు, ఎంపిడిఒలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరు గుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలన్నారు. ఈ మధ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిర్వహించిన రివ్యూ కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై ఆక్షన్ టేకెన్ రిపోర్టు మూడు రోజులలో తమకు పంపాలన్నారు. ఎపిఎస్‌పిడిసిఎల్‌కు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కరెంట్ లైన్ షిఫ్టింగ్ తదితర సమస్యలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. డ్వామా, హౌసింగ్, పనులకు సంబంధించిన రిపోర్టు వెంటనే పంపాలన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు సంబంధించిన పనులు ఒక్కటి కూడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఇకనుంచి రెండు రెండు నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు రాబోయే మూడు రోజుల లోపల సిపిఒ కార్యాలయానికి తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల నోట్స్ తయారు చేసి వెంటనే పంపాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సమావేశంలో ఎమ్మెల్యేలు అడిగిన పనులు ఏవి పెండింగ్ లేకుండా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అన్ని అంశాలలో ముందుండే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, హౌసింగ్ పీడీ శివయ్య, డ్వామా పీడీ మద్దిలేటి, పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పెళ్లై, వివిధ శాఖల హెచ్వోడీలు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిద్దాం : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

అందరి సమన్వయంతో జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహిద్దామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వినాయక చవితి ఉత్సవాలపై అడిషనల్ ఎస్‌పితో కలిసి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ ఉత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సజావుగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది లాగానే ఈ సారి కూడా ఏ చిన్న సంఘటన కూడా జరగకుండా ఉత్సవా లను విజయవంతం చేయాలన్నారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని, వెల్లి గల్లు ప్రాజెక్టు వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. జిల్లాలోని మూడు డివిజన్లలోనూ కూడా శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆర్‌డిఒలకు సూచిం చారు. విగ్రహాలను ఏర్పాటు చేసే పందిళ్లను సంబంధిత తహశీల్దార్, ఎస్‌హెచ్‌ఒలు తప్పనిసరిగా సంద ర్శించాలని సూచించారు. ఈ సదర్భంగా గణేష్ ఉత్సవాల విగ్రహాల ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠాపన, పందిర్ల ఏర్పాటు, ఉత్సవాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లు, నిమజ్జనం సందర్భంగా 3వ రోజు, 5, 9, 11వ రోజులలో విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసేటప్పుడు పాటించాల్సిన భద్రత చర్యలు తదితర పలు అంశాలపై అధికారులు, పోలీసులు, శాంతి కమిటీ సభ్యులతో జెసి సుదీర్ఘంగా చర్చించారు. ఎఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపు కున్నామని అదే తరహాలో వినాయక చవితి పండుగను కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహిం చుకుందామని చెప్పారు. ఎవరెవరు ఏ ప్రదేశంలో ఎన్ని అడుగుల వినాయక విగ్రహం, పందిర్ల స్థల విస్తీర్ణం ఏర్పాటు చేయదలిచారో ఆ వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేసి విగ్రహం ఏర్పాటుకు అనుమతి పొందాలన్నారు. వినాయక విగ్రహం ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటిం చాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గణేష్ ఉత్స వాలలో పోలీసు అధికారులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమా వేశంలో శాంతి కమిటీ సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను కూడా సంప్రదాయ బద్ధంగా, మతసామరస్యం వెల్లి విరిసేలా స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ అందరి సహకారం, సమ న్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు రంగస్వామి, మురళీ, రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అందించే కూరగాయలను పరిశీలిస్తున్న పీడీ ధనలక్ష్మి

పౌష్టికాహారం ప్రతి ఒక్కరికీ అందాలి : పీడీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అంగన్వాడీలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం మదనపల్లి ఐసిడిఎస్ సిడిపిఒ సుజాతతో కలిసి నిమ్మనపల్లిలోని రెడ్డివారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నపిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహార కిట్లను ప్రతి ఒక్కరికి అందించాలని తెలిపారు. సంపూర్ణ పోషకాహార కిట్లలోని పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి 30వ తేదీ వరకు పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి చంటి బిడ్డలకు పాలు పట్టే విధానం, 9 నెలలు నిండిన పిల్లలకు తల్లిపాలతో పాటు, అనుబంధ ఆహారం అందించాలన్నారు. అంగన్వాడీ సంపూర్ణ పోషకాహార కిట్లు దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకున్నప్పుడే చిన్నపిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల, గర్భిణుల్లో రక్తహీనత నిర్మూలన, బాలింతల్లో పాల ఉత్పత్తి సాధించవచ్చని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు ప్రభుత్వం అందించే పోషకాహార కిట్లను తప్పకుండా పిల్లలకు అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, ఇఒపిఆర్డి చలపతిరావు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **చిట్వేలి :** పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కెకె వడ్డేపల్లి ,వెంకటరాజుపల్లి అంగన్వాడీ కేంద్రాలలో పోషక సంబరాలను ఘనంగా నిర్వహించారు. కెకె వడ్డేపల్లి కాలనీలో జరిగిన కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూపౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధించ వచ్చని, అందుబాటులో దొరికే అనేక ఆహార పదార్థాల్లో పోషక విలువలు మెండుగా ఉంటాయనివాటిని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు. ప్రత్యేకించి కూరగాయలు ఆకుకూరలలో పోషక విలువలు అనేకమున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ గ్రేడ్ వన్ సూపర్వైజర్ వసుంధరమ్మ, సురేఖరాణి గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పాస్ పుస్తకాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్రెడ్డి

రీసర్వేతో భూ వివాదాలు దూరం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వలచెరువు గ్రామ సచివాలయంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డిః ఆధ్వర్యంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్లో వివాదాలకు తావు లేకుండా సమగ్ర సర్వే చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ ఆస్తుల లావాదేవీలు గ్రామంలో కనిపించే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇటువంటి మంచి సంస్కరణ అమల్లోకి తీసుకొచ్చిన సిఎం జగన్కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చేర్మెన్ కర్ణపు విశ్వనాథ్రెడ్డి, తహశీల్దార్ అరవింద్కిషోర్, ఎండిఒ హైదర్అలీ, ఆర్ఐ రవికుమార్, పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరి, ముబారక్ ,శివయ్య, రమణ, ఫైరోజు, సచివాలయం సిబ్బంది పాలొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట

మాట్లాడుతున్న ఎస్ఐ రఘురాం

మండల పరిధిలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని విగ్రహాలను ఏర్పాటు చేసుకొని వారు ముందస్తు అనుమతులు తప్పనిసరని ఎస్ఐ రఘురాం పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు శాంతిభద్రతకు, మత సామరస్యానికి ఇబ్బంది కలగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలని తెలిపారు. గణేష్ మండపాల వద్ద సౌండ్ సిస్టం, డిజె పెట్టకూడదని, అలా పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీలైనంత వరకు మట్టితో తయారుచేసిన విగ్రహాలనే కొనుగోలు చేయాలని తెలిపారు. విగ్రహం సైజు, బరువు, నిమజ్జనం ఎన్ని రోజులకు నిర్వహిస్తారు, నిమజ్జనం చేసే తేదీ, కమిటీ సభ్యుల వివరాలను ముందుగానే తెలియపరచాలని తెలిపారు. దీపారాధనలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శబ్ద కాలుష్యం అరికట్టేందుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నియమాలు విధిగా పాటించాలని, ఉదయం 8 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో అశ్లీల పాటలు వేసిన, డాన్సులు వేసిన, మందు గుండు సామాగ్రి కాల్చిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక నిమజ్జన ఊరేగింపు ప్రారంభించి నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

యువత సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చెక్కును అందజేస్తున్న ప్రిన్సిపల్ క్రిష్ణారెడ్డి

యువత చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో ముం దుండాలని శ్రీకృష్ణారెడ్డి సిధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సి పల్ ఎన్.కృష్ణరెడ్డి అన్నారు. కరోనా మృ తదేహాల అంత్యక్రియలు నిర్వహించడంలో పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో హెల్పింగ్ మైండ్స్ సేవలను అభినందిస్తూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రూ.10 వేల చెక్కును హెల్పింగ్ మైండ్స్ వ్యవ స్థాపకుడు అబూబక్కర్కు అందించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి సిధార్థ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి నెమలి

ఎటిఎంలో నెమలి

తంబళ్లపల్లి : మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండ అటవీ ప్రాంతం నుంచి ఒక నెమలి మంగళవారం జన అరణ్యంలోకి వచ్చింది. రోడ్డుపై వెళ్తుంటే చూపరులు నెమలి చూడటానికి ఎగబడ్డారు. ఇండియన్ బ్యాంక్ ఎటిఎం కేంద్రంలోకి వెళ్ళింది. నెమలిని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపించారు. ఇంతలో భయానికి లోనైనా నెమలి పక్కనే ఉన్న వేపచెట్టు పైకి ఎగిరి అక్కడి నుంచి మల్లయ్య కొండ అటవీ ప్రాంతం వైపు వెళ్ళింది.

భవిష్యత్ నిర్మాతలు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భవిష్యత్తును నిర్మించేది ఉపాధ్యాయులేనని లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ అధ్యక్షులు కె. నిర్మల్ కుమార్ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయం తిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పట్టుదల క్రమ శిక్షణతో చదువు కుంటూ ఉన్నతమైన లక్ష్యాలను అధిరోహించాలన్నారు. ప్రతి ఒక్కరూ సర్వే పల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.ఎస్ హరినాథ్రెడ్డి, మాజీ అధ్యక్షుడు మహమ్మద్ లయన్ వి.నారాయణరెడ్డి, లయన్ రామాంజ నేయులు లయన్ రవి లయన్ ప్రకాష్ రెడ్డి సన్రైస్ స్కూల్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, హెడ్మాస్టర్ రెడ్డప్ప రెడ్డి, నాగేంద్ర, నందిని ట్రావెల్స్ వినోద్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. **నందలూరు :** భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్135వ జయంతి సందర్భంగా మండలంలోని నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపా ధ్యాయులు జయలలిత కుమారి, ఎంఇఒ తిరుమల్, ఉపాధ్యాయులు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యా యులు ఖాదర్బాషా, డాక్టర్ నాగేంద్రప్రసాద్, ఆనందరావు, జీవి ప్రతాపరావు, గంగిసెట్టి వెంకటరమణ, బోగా వెంకట సుబ్బ య్య, నాగిరెడ్డి లక్ష్మీనారాయణ, రవిశంకర్రెడ్డి, స్వర్ణలత, విజయ కుమారి, గౌరీ, సుబ్బరాయుడు, మస్తాన్, ఎం. రమణమ్మ జ్యోతి ప్రియ, ఆర్.వి. రమణమ్మ జి.వి.రమణ, ప్రమీల రాహుల్, షాకీర్ హుస్సేన్, పెంచలయ్యలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. **కలకడ :** మండలంలోని గురుపూ జోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు రకాల ప్రభుత్వ ప్రయివేట్ గురుపూజోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలో అన్ని పాఠశాలల యందు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **రాజంపేట అర్బన్ :** నవ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతు గుంట రమేష్ నాయుడు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డిబిఎస్పల్లె ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, స్వర్ణలత, మాదాలస గీతలను శాలువా, పుష్పమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నాగేంద్ర, వెంకటసుబ్బయ్య, జికె.నాగరాజు, నగేష్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని బాలసానిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, చెన్నకేశవులను విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలసి ఘనంగా సన్మానించారు. వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎం ఆర్ సి నరసింహులు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివుడు నాయక్ దంపతులు నరసప్ప పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని బిపి శేషయ్య సంస్కృత ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, నియోజకవర్గ ఇన్ఛార్జి గోసాల దేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మురళీ, సహాయ ప్రధాన ఉపాధ్యా యుడు వరదారెడ్డిలను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుల్లంపేట కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, మండల అధ్యక్షుడు బొమ్మన నాగరాజు, పుల్లంపేట యూత్ అధ్యక్షుడు సిగమాల రవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** మండలంలోని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలికిరి క్రాస్ రోడ్ చదివేవాళ్ళపల్లి ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్మన్ మస్తాన్ అహ్మద్ హాజరై సర్వేపల్లి రాధాకృష్ణ ప్రపంచం లోనే గొప్ప వ్యక్తి అని ఉపాధ్యాయ వృత్తి చేపట్టి విధ్యార్థులకు విద్యా బుద్దులు నేర్పి దేశంలో అత్యున్నత పదవి చేపట్టి సమాజానికి విలువలు నేర్పారని అన్నారు. ప్రిన్సిపల్ మలాంషావలి ఉపాధ్యాయులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేని నివాళి అర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శాలువా కప్పి పూలమాల వేసి ఆశీస్సులు తీసుకున్నారు. **రైల్వేకోడూరు :** నియోజకవర్గం పెనగలూరు మండలం చక్రంపేట జడ్పి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ ఆధ్వ ర్యంలో అక్షర జ్ఞాన సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు డి అన్వర్ భాషా ని సన్మానించారు. తదుపరి గోపాలకృష్ణ గారికి రాయచోటి లయ గార్డెన్స్ నందు జిల్లాఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా చక్రంపేట ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణను కలెక్టర్ గిరీషచే సన్మానం అందుకున్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని ప్రత్యూష హైస్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ చందనబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసేందుకే పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చందనబాబు, ఉపా ధ్యాయులు నరసింహులు, రవి, వాసు, సురేష్, సుధాకర్, రాధ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్** చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చే నడపబడుతున్న ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. **జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో:** గురువులందించే జ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వెలుగు సంస్థలో :** మదన పల్లె మండలం కోళ్ళ బైలు పంచాయతీ అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, వెలుగు ప్రిన్సిపల్ పి.లీనాకుమారి ముఖ్యఅతిధిగా విచ్చేశారు. **మిట్స్లో :** మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో టీచర్స్డేను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్, అధ్యాపకులు శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. **లక్కిరెడ్డిపల్లి :** మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవాన్ని లక్కిరెడ్డిపల్లి మండల సభా భవ నంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిదులుగా మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శనరెడ్డి, ఎంపిటిసి సైద్ అమీర్ మండల విద్యా శాఖ అధికారులు చక్రీనాయక్, వెంకటసుభయ్యా మానవతా చైర్మన్ బాల సుబ్ర మణ్యం, మానవతా కేంద్ర కమిటీ సభ్యులు వై. ప్రసాద్ యాదవ్, కో చైర్మన్ శివశంకర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి ఆర్ శివయ్య, అధ్యక్షలు వివి. రమణా రావు, కార్యదర్శి రాముడు, కోశాధికారి రవిశంకర్ పాల్గొన్నారు. **పందిళ్లపల్లి ఆదర్శపాఠశాలలో :** విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఆదర్శప్రాయులని పందిళ్ళపల్లి యుపిస్కూల్ ప్రధానోపా ధ్యాయులు బాల రాజు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు స్థానిక పాఠశాలలో నిర్వహించారు. రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేష్బాబు, వీరస్వామి, శిరీష, పద్మావతి, గంగాధర్, నాగార్జున విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యా యులు కానాల శివరెడ్డిని మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిసిసి బ్యాంక్ సిబ్బంది సన్మానించినట్లు సన్మానించిడం నోడల్ ఆఫీసర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమము పాఠశాల ప్రధాన ఉపాధ్యాయడు మొహిద్దిన్, డిసిసి బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సివి.నారా యణరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రెడ్డి శివప్రసాద్ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్సి భవనంలో ఎంఇఒలు పద్మావతి, నారాయణ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథు లుగా ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, ఆరక్ష్మి రమణారెడ్డి, సింగిల్విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్రెడ్డి, ఎంపిడిఒ శేషగిరిరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది, పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : సన్మానం పొందిన ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సయ్యద్ సర్తాజ్

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ గురుపూజోత్సవం పురస్కరించుకొని ఎంపిపి ముద్దా బాబుల్రెడ్డి, మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును ప్రదానం చేశారు. ర్యక్రమంలో తాసిల్దార్ నరసింహకుమార్, ఎంఇఒలు చక్రధర్రాజు, నాగ తిరుమల రావు, టీ.కమ్మపల్లి ఉపాధ్యాయులు రమణారెడ్డి, రమణయ్య, ప్రమీల మండల ఉపాధ్యాయ బృందం నరేంద్ర, సిఆర్పిలు శివ పాల్గొన్నారు.

ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

రామాపురం : మండలం నుండి జిల్లాకు ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఇఒ రామకృష్ణుడు తెలిపారు. మండలంలోని బి.రాచపల్లి, నాయినివారిపల్లి, పాలన్నగారిపల్లె ఎంపిపి పాఠశాలలో పనిచేస్తున్న రామచంద్ర, విశ్వనాథ, వెంకట్రామిరెడ్డి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బివిఎన్ విద్యాసంస్థలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ముందస్తు వేడుకలు విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని అహూతులను అలరించారు. సంప్రదాయబద్ధంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించుకుని ఉట్టి కొట్టే కార్యక్రమంతో ఆనంద హేల మధ్య వేడుకలను ముగించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధా నోపాధ్యాయులు రాము మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేసేందుకే పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** పట్టణంలోని కొత్త బజార్లో గల సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో కరస్పాండెంట్ ఎంవి.కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రాధాకృష్ణ వేషధారణలతో అలరించారు. కృష్ణా ష్టమి పురష్కరించుకొని డ్రాయింగ్ కాంపిటీషన్లు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అదించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాహుల్, విజయలక్ష్మి,స్నేహలత పాల్గొన్నారు.

పుల్లంపేట : శ్రీకృష్ణవేషధారణలో చిన్నారులు

అభివృద్ధిని చూసి ఆదరించండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మరల వైసిపిని ఆదరించాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, రవిశంకర్రెడ్డి, చిన్నబాబులు పిలుపునిచ్చారు. మంగళవారం కన్యమడుగు, మర్రిమాకులపల్లి పంచాయతీలలో సర్పంచుల శ్యామలమ్మ, జ్యోతి, ఎంపిటిసి సభ్యులు మహేష్ల ఆధ్వర్యంలో పల్లెపాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను పలకరించి సమస్యలను తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి పల్లెకు రోడ్లు వేపించిన ఘన చరిత్ర ఎమ్మెల్యేదే అన్నారు. నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పల్లె సీమల ప్రగతి కోసం మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్రెడి, ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాలను మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్న రెడ్డి వైఎస్ఆర్ మండల కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్య కొండ చైర్మన్ రెడ్డి మల్రెడ్డి, సింగల్ విండో చైర్మన్ భార్గవ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎపిఒ అంజనప్ప, ఎపిఎం గంగాధర్, నాయకులు లక్ష్మీదేవి, మల్లప్ప, చంద్రశేఖర్రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం : 'గడికోట'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అనంతపురం గ్రామం ఈడిగపల్లెలో గ్రామ సచివాలయ నూతన భవనాన్ని శ్రీకాంత్రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలోనే ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రజా అవసరాల నిమిత్తం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వ్యయ, ప్రయాసలు లేకుండా చేశారన్నారు. .గ్రామ సచివాలయాలకు కోట్లాది రూపాయలుతో శాశ్విత కార్యాలయ భవనాలను నిర్మించి పల్లెల మార్పుకు శ్రీకారం చుట్టారన్నారు.

ప్రతి గ్రామంలోనూ సిమెంటు రోడ్లు

ఈడిగపల్లి లో రూ.10 లక్షల నిధులతో పూర్తయిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధు లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్రెడ్డి, మాజీ ఎంపిపి అంబాబట్టిన రెడ్డయ్య, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్అమీర్, సర్పంచ్లు వెంకటనారాయణరెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజబాబు, సింగల్ విండో డైరెక్టర్ రెడ్డయ్య పాల్గొన్నారు.



నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్రెడ్డి

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కిషోర్కుమార్రెడ్డి

మధుమేహ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

మధుమేహ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంవి.కిషోర్కుమార్రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం.వి.కిషోర్కుమార్రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. యాభై ఏళ్ల పైబడిన వారందరికీ అధిక రక్తపోటు, షుగర్ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఆరేళ్ల పైబడిన పిల్లలకు విటమిన్-ఎ మాత్రలను ప్రతి గురువారము స్కూల్ పిల్లలకు మింగించాలని వైద్యాధికారి సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో సందర్శించి ఫుడ్ రిజిష్టర్ను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి జయరామయ్య, ఆరోగ్య కార్యకర్త సి.లక్ష్మీదేవి, ఆర్.శివప్రసాద్, ఎంఎల్హెచ్పిజె ఎస్.గోపికృష్ణ , 104 డేటా ఎంట్ర ఆపరేటర్ రోజా, పైలట్ రమేష్బాబు, ఆశ కార్యకర్త కె.పద్మావతి, అంగన్వాడీ కార్యకర్త సి.శోభరాణి పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి బిడ్డకూ వ్యాక్సిన్ ఇవ్వాలి

కలకడ : పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ ఇవ్వాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పి.జవహర్బాబు ఆధ్వర్యంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆశాడే కార్యక్రమం ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రతి బుధవారం శనివారము ఐఎఫ్ఒ టాబ్లెట్స్ , విటమిన్-ఎ టానిక్, ఇ-ఆశ యాప్లో తప్పకుండా నమోదు చేయాలన్నారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో స్పెషల్ డ్రైవ్ ప్రతి నెలలో ఒక వారం పాటు తప్పకుండా వ్యాక్సిన్ను గర్భిణులు, పిల్లలకు వేయాలని యువిన్లో వాక్సినేషన్ వేయాలని సూచించారు. జాతీయ మలేరియా కార్య క్రమంలో జూన్ మాసం నుంచి మార్చి నెల వరకు మలేరియా కేసులు ఎక్కువ ప్రబలే అవకాశ ముందని, ఆశ కార్యకర్తలు డోర్టుడోర్ సర్వేలు నిర్వహించాలన్నారు. దగ్గు, జ్వరము ఉన్నవారికి రక్త పరీక్షలు నిర్వహించి వారికి వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ బి రెడ్డమ్మ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

పంటల్లో తెగుళ్ల నివారణకు సూచనలు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని మునేలపల్లి గ్రామంలో కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వై. పీరుసాహెబ్, జిల్లా వనరుల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వి.శ్రీకాంత్, వ్యవసాయ అధికారి మమత ఆధ్వర్యంలో వరి, వంగచ మిరప పంటలను పరిశీలించారు. వరిలో కాండం కుళ్ళతెగులు గమనించి నివారణగా పొలంలో నీరు తీసి హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వంగలో వెర్రి తెగులు గమనించారు. లేత ఆకులు చిన్నవిగా మారి పూత, కాయ రాదని తెలిపారు. దీని నివారణకు అసిటామిప్రిడ్ 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మిరప పంటలో కొమ్మ ఎండుకాయ కుళ్ళు పరిశీలించారు. మొక్కపై భాగం నుంచి కిందకు ఎండిపోవడం కాయల్లో కుళ్ళును గుర్తించారు. దీని నివారణకుగాను కాపర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రాము స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.1 గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసి నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఆర్బికె సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి మండల స్థాయి ఎస్జిఎఫ్ పోటీలు

చిట్వేల్ : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోఈనెల 7,8వ తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్14 , 17విభాగాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్ఛార్జి ప్రధానోపా ధ్యాయులు ఎబిఎన్.ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట సుహాసిని, షబ్బీర్ అహ్మద్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపా ధ్యా యులు , వ్యాయామ ఉపాధ్యాయులు, మండల స్థాయి ఆటల పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి సమీపంలో గల కొత్తపల్లి క్రాస్ వద్ద రెండు కార్లు వేగంగా ఒకదానికొకటి ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్యారాజాన్, మస్తాలను బి.కొత్తకోట పిహెచ్సి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారిన చెప్పారు. నిజాముద్దీన్, మున్నాబీ మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారంతా ఉపాధ్యాయులేనని అన్నారు. ఈ ఘనటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్టాఫ్ నర్స్కు వేధింపులు

-ఎస్సి, ఎస్టి కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ స్టాఫ్నర్స్ పై వేధింపులకు పాల్పడిన ఓ దంత వైద్యునితో పాటు మరో నిందితురాలిపై ఎస్సి, ఎస్టి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ గా పనిచేస్తున్న రెడ్డమ్మ, గత కోవిడ్ సీజన్లో తిరుపతి రుయా ఆస్పత్రిలో పనిచేస్తుందేదని తెలిపారు. ఆ సమయంలో తిరుపతికి చెందిన దంత వైద్యుడు షేక్ మహమ్మద్ సుభాని తో పరిచయమైందని. ఒకే చోట పనిచేస్తుండడంతో ఆమె ఫోన్ నెంబర్ తీసుకుని తరచూ మాట్లాడుతుండేవారని చెప్పారు. తర్వాత కొంత కాలానికి ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకొని ఆమెను లోబర్చుకునేందుకు ప్రయత్నిస్తూ, ఫోన్లో అసభ్యకరంగా మాట్లాడడం, మెసేజ్ చేస్తుండేవాడని చెప్పారు. బాధితురాలు రెడ్డమ్మ అతని ఫోన్ నెంబర్ తన ఫోన్ లో బ్లాక్ చేసిందని చెప్పారు. షేక్ మహమ్మద్ సుభాని రెడ్డమ్మ పనిచేస్తున్న ప్రాంతం తదితర వివరాలు తెలుసుకొని, ఇతరుల ఫోన్ నెంబర్తో ఆమెకు మెసేజ్ చేయడం ఆడియో, వీడియో రికార్డింగ్లు పంపడం చేస్తుండేవాడని పేర్కొన్నారు. తన భార్య ఫాజియా ద్వారా కూడా ఆమెను బెదిరించాడని తెలిపారు. గత నెల ఆగస్టు 30న రెడ్డమ్మ నిమ్మనపల్లె ప్రభుత్వ వైద్యశాలలో విధుల్లో ఉండగా, షేక్ మొహమ్మద్ సుభాని అతని భార్య ఫాజియా ఇద్దరు కలిసి ఆస్పత్రికి వచ్చారని చెప్పారు. బాధితురాలని కులం పేరుతో దూషిస్తూ, రూ.10 లక్షలు ఇవ్వకపోతే నీ అంతు చూస్తామంటూ బెదిరించి. మానసికంగా వేధించాడని తెలిపారు. వారి వేధింపులపై బాధితురాలు రెడ్డమ్మ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందని. బాధితురాలు పిర్యాదు మేరకు నిందితులు దంత వైద్యుడు షేక్ మొహమ్మద్, సుభానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.